మోసం చేయడమే బాబు నైజం

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు/ యాడికి/ గార్లదిన్నె/ పుట్లూరు: అలవికాని హామీలిచ్చి, ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పెద్దవడుగూరు మండలంలోని మల్లేనిపల్లిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి గ్రామంలో పర్యటించి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తెలియజేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు మోసాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఇప్పటి వరకూ సక్రమంగా అమలు చేయలేని దుస్థితి దాపురించిందన్నారు. అర్హులైన వారి పింఛన్లను కూడా తొలగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పరిపాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. అనంతరం క్యూ ఆర్ కోడ్ సాయంతో కూటమి ప్రభుత్వం నెరవేర్చని హామీలను వివరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్త దస్తగిరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

▸▸ యాడికి మండలంలోని రాయలచెరువు గ్రామంలోని ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కాలనీలో బాబు ష్యూరిటీ ..మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెన్నపూస వెంకటరాముడు, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానంద రెడ్డి, పార్టీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి నాగేష్, నాయకులు వేలూరు జగదీస్, శివయ్య, జిలాన్ భాష, అనిల్ కుమార్, కోనా జగదీశ్వర రెడ్డి, బోయ రెడ్డిపల్లి మారుతి, నాగేంద్ర రెడ్డి, రామకృష్ణ, బీసీ మల్లికార్జున, దేవేంద్ర, రంగస్వామి పాల్గొన్నారు.

▸▸ గార్లదిన్నె మండలంలోని ఎగువపల్లి, కల్లూరు, ఇల్లూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి , ఎంపీపీ వెంకటనారాయణ, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఇంటలెక్చువల్ రాష్ట్ర కార్యదర్శి తనీషా, ఇంటలెక్చువల్ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ శంకరయ్య, ఇంటలెక్చువల్ జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు, శింగనమల నియోజకవర్గ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు అనిల్‌కుమార్ రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు పుల్లారెడ్డి, ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజు, ఆయా గ్రామాల నాయకులు రవికుమార్,చితంబరెడ్డి, కేశవయ్య, బాలిరెడ్డి, ప్రసాద్, ఇల్లూరు సర్పంచు జయరాం పసల ఆదినారాయణ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

▸▸ పుట్లూరు మండలంలోని మడ్డిపల్లి, నారాయణ రెడ్డిపల్లి, చాలవేముల గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల పేద ప్రజలకు జరిగిన నష్టాన్ని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేశ్వర రెడ్డి, జిల్లా కార్యదర్శి రమణయాదవ్ నాయకులు మడ్డిపల్లి ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, చాలవేముల శ్రీరామిరెడ్డి,సాయినాథరెడ్డి, వెన్నెం శివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, చరణ్, శ్రీధర్‌రెడ్డి, సూర్య నారాయణరెడ్డి,రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ఒక్క పథకమైనా ప్రజలకు ఇచ్చారా?

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పరిపాలనలో ప్రజలకు కొత్తగా ఒక్క పథకం అయినా ఇచ్చారా అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం మండలంలోని బి.కొత్తపల్లి, వడియంపేట, పొడరాళ్ల, రేగడి కొత్తూరు గ్రామాల్లో ఇంటింటికీ చంద్రబాబు మోసం–మోసపూరిత హామీల రీకాలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాడన్నారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. అనంతరం చంద్రబాబు మోసం చేసిన విధానాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు అంకే నరేష్, నాగిరెడ్డి, అప్పిరెడ్డి, అనంత వెంకటరెడ్డి, సుబ్బరాయుడు, మంత్రి ఆంజనేయులు, సర్పంచ్ ఎర్రిస్వామి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నాగ, కాటమయ్య, రామాంజనేయులు, రంగా సుబ్బారెడ్డి, రవి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వడియంపేటలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి

సూపర్ సిక్స్ హామీలు గాలికి వదిలేశారు..

తాడిపత్రిటౌన్: తప్పుడు వాగ్దానాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు మండిపడ్డారు. తాడిపత్రి పట్టణంలోని 35, 4, 34, 30, 29 వార్డుల్లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వార్డులలో కలియ తిరుగుతూ ఎన్నికల ముందు చంద్రబాబు సహా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు, గెలుపొందిన అనంతరం వారు మాట్లాడుతున్న మాటలను ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రశ్నించేవారి గొంతు నొక్కుతుందన్నారు. అనంతరం ఆయా వార్డులలోని కాలనీ వాసులతో మొబైల్ ఫోన్‌లలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి మోసాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ ప్రెసిడెంట్ కేశంరెడ్డి సుబ్బారెడ్డి, సోషల్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి మునగనూరి అమరేశ్వరెడ్డి, షేక్ సబ్బీర్, వల్లెపు గంగాధర్, సంపంగి వెంకటనాగయ్య, ఎస్ఎన్ అలీబాబా తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రిలోని 35వ వార్డులో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



యాడికి మండలం రాయలచెరువులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గార్లదిన్నె మండలం ఎగువపల్లిలో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లిలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న నాయకులు

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుంతకల్లుటౌన్: పట్టణంలో 33 కె.వి. కొత్త విద్యుత్ లైన్‌ల ఏర్పాటు పనులు నిర్వహించనున్న సందర్భంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ నాగేంద్ర, ఏఈ రఘునాథ్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయానికి చింతిస్తున్నామని, ప్రజలు సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ఎస్ఎస్ ట్యాంకుల్లోకి నీటి పంపింగ్



గంగపూజ చేస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే రిజర్వాయర్లలోకి కృష్ణా జలాల పంపింగ్ ప్రారంభించారు. శుక్రవారం ఉదయం పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హంద్రీ-నీవాలోని కృష్ణాజలాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని గంగపూజ చేసి కృష్ణమ్మ తల్లికి పసుపు, కుంకుమతో పాటు చీరను సమర్పించారు. అనంతరం స్విచ్ ఆన్ చేసి రిజర్వాయర్లలోకి నీటి పంపింగ్ షురూ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, ఎంఈ ఇంతియాజ్, టీడీపీ నాయకుడు నారాయణస్వామి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న మంత్రి

గుంతకల్లు రూరల్: రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారుల ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మంత్రి కుటుంబ సభ్యుల పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు.. ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.


విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న ట్రాక్టర్



విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న ట్రాక్టర్

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని మెయిన్ రోడ్డులో శుక్రవారం ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు డివైడర్ మధ్యలో మున్సిపాలిటీ బటర్ ఫ్లై విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. ఘటనలో విద్యుత్ స్తంభం పూర్తిగా వంగి పోయి కింద భాగం దెబ్బతినింది. ట్రాక్టర్ కూడా రోడ్డు మధ్యలో ఇరుక్కుపోయింది. మున్సిపల్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగులకు సన్మానం



వీఆర్వోలను సన్మానిస్తున్న తహసీల్దార్

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఇటీవల బదిలీ అయిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీఆర్వోలు వేణు, రాజేష్, సోమశేఖర్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం బదిలీ అయిన విలేజ్ సర్వేయర్లను సన్మానించారు. తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగీ ప్రజలకు నిష్పక్షపాతంగా, జవాబుదారీతనంగా సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ వసతి గృహాలు



మాట్లాడుతున్న కుళ్లాయిస్వామి

గుత్తి/గుత్తిరూరల్: 'ప్రభుత్వ వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి' అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ డిమాండ్ చేశారు. గుత్తిలోని బీసీ బాలికల వసతి గృహం, మండలంలోని సేవాఘడ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం వారు సందర్శించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని పలు వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టాలన్నారు. హాస్టళ్లలోని అన్ని సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆసిఫ్ , పరమేష్, రోహిత తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ రాజుకు దళితులే బుద్ధి చెబుతారు

గుంతకల్లు: మాజీ సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ పార్టీపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు దళితులే తగిన బుద్ధి చెపుతారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ యువజన విభాగం నాయకులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో సామూహిక అత్యాచారానికి గురైన 14 ఏళ్ల దళిత బాలికకు న్యాయం చేయాలంటూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ యువజన విభాగం చెందిన నేతలు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే పోలీసులు చేత అడ్డుకుని అరెస్ట్ చేయడం ఎంత వరకు సమజసమన్నారు. అదేవిధంగా మడకశిరకు మంత్రి వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంఎస్ రాజు పరుష పదజాలంతో మాట్లాడం మంచి పద్ధతి కాదన్నారు. చంద్రబాబు, లోకేష్ దగ్గర మార్కులు పడుతాయంటే వాళ్లకు ఊడగం చేయి.. అంతేగాని వైఎస్సార్‌సీపీ, తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిపై రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తే చూస్తు ఊరుకోమని ఎంఎస్‌రాజును హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గ అధ్యక్షులు కొనకొండ్ల ఆంజి, పట్టణ ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, ఎస్సీ సెల్ పట్టణ ఉపాధ్యక్షుడు మోపూరి రాజశేఖర్, యువజన విభాగం గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ బాసిద్, పట్టణ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, మండల అధ్యక్షుడు శాంతానాయుడు, ఉపాధ్యక్షుడు షేక్ ఫయాజ్, నాయకులు అనిల్‌కుమార్, మైనుద్దీన్. జిలాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ యువజన విభాగం నాయకులు

నకిలీ డాక్యుమెంట్లతో మహిళకు టోకరా

బుక్కరాయసముద్రం: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఓ మహిళకు ఆ స్థలాన్ని విక్రయించిన ఘటన బీకేఎస్ మండలంలోని గోవిందపల్లి పంచాయతీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. అనంతపురం వినాయకనగర్‌కు చెందిన నాగరత్నమ్మ తాడిపత్రి మండలం చిన్న పొలమాడ గ్రామానికి చెందిన చౌక్కా రాము నుంచి గోవిందపల్లి పంచాయతీలోని బీజేపీ కాలనీ సమీపంలో సర్వే నెంబర్ 295లో 7.16 సెంట్లు 2021లో రూ. 21 లక్షలకు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే హద్దులు చూపించాలని రామును పలుమార్లు నాగరత్నమ్మ అడిగినా వాయిదా వేస్తూ వచ్చాడు. దీంతో నాగరత్నమ్మ బండలు పాతుకోవాలని స్థలం వద్దకు వెళ్తే అక్కడ కొంత మంది వ్యక్తులు సర్వే నెంబరు, ప్లాటు నెంబర్లు తప్పుగా ఉన్నాయని, ఈ ప్లాటు వేరే వారి పేరున ఉందని వివరించారు. దీంతో బాధిత మహిళ రాముకు ఫోన్ ద్వారా సంప్రదించగా అతను సరిగా స్పందించకపోవడంతో పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బాధిత మహిళ నాగరత్నమ్మ

12వ రోజుకు చేరిన రిలే దీక్షలు

పామిడి: పామిడిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఐక్య మాదిగ సమాజ్ ఆధ్వర్యంలో వంద గంటల రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 12వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్‌తో పాటు రాజకుమార్, కేశవ, నాగశేఖర్, ఓబుళపతి, రాజేష్, పెద్ద వెంకటరాముడు, వన్నూరప్ప దీక్ష బూనారు. ఈసందర్భంగా వంకరాజుకాలువ వెంకటేష్ మాట్లాడారు. పేదల పెన్నిధి అయిన ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం రిలేదీక్షలు చేపట్టామన్నారు. శనివారం 1 గంటతో వంద గంటల దీక్ష పూర్తవుతుందన్నారు. ముగింపు దీక్షలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.



అంబేడ్కర్ సర్కిల్‌లో దీక్ష చేస్తున్న దృశ్యం

భూ సమస్య పరిశీలన

గార్లదిన్నె: మండలంలోని కేశవాపురంలో భూ సమస్యను శుక్రవారం ఆర్డీఓ కేశవనాయుడు పరిశీలించినట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ కేశవాపురంలో 142,148,149 సర్వే నంబర్లో ప్రభుత్వ భూమి రస్తా సమస్య గత నాలుగు నెలలు నుంచి పెండింగ్ ఉంటే ఆర్డీఓ పరిశీలించారన్నారు. అలాగే యర్రగుంట్లలో భూమి సమస్య ఉండగా బాధిత రైతులను తహసీల్దార్ కార్యాలయంకు పిలిపించి మాట్లాడారన్నారు.



కేశవాపురంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

భక్తులకు ఇబ్బంది కలగనీయొద్దు

గుంతకల్లు రూరల్: శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి భక్తులు భారీ ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం అధికారులతోపాటు, పోలీస్, వివిధ శాఖల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో నెలరోజుల పాటు శ్రావణమాసం ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో సమర్థవంతంగా ఉత్సవాల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. డీఎస్పీ శ్రీనివాస్, ట్రైనీ డీఎస్పీ అష్రఫ్ అలీ, ఇతర పోలీస్ సిబ్బంది, ఆలయ ఈవో కే.వాణి, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



శ్రావణమాస ఉత్సవాలపై సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా శ్రావణ మాస పూజలు

గుత్తి/పామిడి/తాడిపత్రి రూరల్ : గుత్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురష్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో లలిత సహస్ర నామార్చన, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పార్చన, మహామంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే పామిడి పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీ మాతృమండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రాకారోత్సవంతో పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. అదేవిధంగా తాడిపత్రి పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న వేదగాయత్రిమాత, అమరలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అలాగే అంబ భవానీదేవికి పసుపు, కుంకుమతో అలంకరణ చేశారు. స్వకుళ సాలీల మహిళలు ఇంటి నుంచి పిండివంటలు తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. అనంతరం సహస్ర లలిత నామార్చన చేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్, జాయింట్ సెక్రటరీ శారద, పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓపికగా పని చేయాలి

గుంతకల్లు: చిన్నారులకు పాఠాలు నేర్పే ఉపాధ్యాయులు ఓపికగా పని చేయాలని ఎంఈఓ మస్తాన్ రావు సూచించారు. పట్టణంలోని భాష్యం, నారాయణ హైస్కూల్‌లో చదువుతున్న ప్రైమరీ విద్యార్థులను టీచర్లు కొట్టినట్లు ఫిర్యాదు అందడంతో ఆయా హైస్కూళ్లలోని ఉపాధ్యాయులకు ఎంఈఓ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పిల్లలను భయపెట్టకుండా ప్రేమతో చదువులు చెప్పాలన్నారు. శారీరక దండన నేరమన్నారు.

సుబ్బరాయసాగర్ పరిశీలన

పుట్లూరు: మండలంలోని సుబ్బరాయసాగర్‌ను శుక్రవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి పరిశీలించారు. సాగర్ వద్ద లీకేజీకి కారణమవుతున్న షట్టర్ల పరిస్థితిపై హెచ్చెల్సీ అధికారులను ఆరా తీశారు. అలాగే కుమ్మనమల, బొప్పేపల్లి చెరువులను పరిశీలించారు. పుట్లూరు, కోమటికుంట్ల, జీసీ పల్లి చెరువులతో పాటు బొప్పేపల్లి చెరువుకు నీటిని సరఫరా చేయడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం జాజికొండ వాగు ద్వారా వర్షపు నీరు సమృద్ధిగా పుట్లూరు చెరువుకు చేరాలంటే చేపట్టాల్సిన పనులపై స్థానిక రైతులతో చర్చించారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి: అక్రమంగా తాడిపత్రి నుంచి యాడికి మండలానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. నిందితుడు మండలంలోని వేములపాడు గ్రామానికి రాఘవ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని కంపచెట్లలో కొందరు పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో ఎస్ఐ సురేష్ సిబ్బందితో దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.13,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైక్ బోల్తా –ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో శుక్రవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గుంతకల్లుకు చెందిన శ్రీనివాసులు, మధు పని మీద బైక్‌లో గుత్తికి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన మధు, శ్రీనివాసులును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

గుత్తి: ఓ మైనర్ బాలికను ప్రేమించాలని వేధిస్తుండటంతో పాటు బాలిక తల్లిదండ్రులు చంపుతానని బెదిరించిన మధుసూదన్ అనే వ్యక్తిపై పోలీసులు శుక్రవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు. మండలంలోని తురకపల్లికి చెందిన మధుసూదన్ కొంతకాలంగా గుత్తి ఆర్ఎస్‌కు చెందిన బాలికను ప్రేమించాలని వేధిస్తున్నాడు. వేధింపులు అధికం కావడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సురేష్ నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మట్కా బీటర్ల అరెస్టు

గుత్తి: పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్ వెనుక ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ ఇంట్లో మట్కా రాస్తున్న నలుగురు బీటర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 34,300 నగదుతో పాటు మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరామర్శ



ఎంపీపీ వెంకటరామిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య)ని శుక్రవారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎంపీపీ స్వగ్రామం బొందలదిన్నెకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం బాగయ్యేంత వరకూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేటి నుంచి 'రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో'

శింగనమల: మండలంలో శనివారం నుంచి రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ శుక్రవారం తెలిపారు. 26న ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి, కొరివిపల్లి, అలంకరాయణపేట, జూలకాల్వ, పెద్ద జలాలపురం, 27న పెరవలి, పోతురాజుకాల్వ, చక్రాయిపేట, సీ.బండమీదపల్లి, శివపురం గ్రామాల్లో రీ కాలింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

కలామ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

యాడికి: స్థానిక నం:4 ప్రాథమిక పాఠశాల ఆవరణలో యాడికి మండల కేంద్రానికి చెందిన స్టాంప్ రైటర్ రజాక్ తన సొంత నిధులతో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ విగ్రహంను త్వరలో ఏర్పాటు చేస్తున్నారని హెచ్ఎం చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఉదయం పాఠశాల ఆవరణలో రజాక్ చేతుల మీదుగా విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె: సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు దిలీప్‌కుమార్, హనీషా సూచించారు. శుక్రవారం మండలంలోని మర్తాడులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పథకాల సొమ్ము అప్పలకు జమ చేసుకోవద్దు



ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

శింగనమల: తల్లికి వందనం లాంటి ప్రభుత్వ పథకాలు, ఉపాధి హామీ బిల్లులను అప్పులకు జమ చేసుకోకుండా ఖాతాదారులకు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సలకంచెరువు ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాల్లోకి జమవుతున్న ఉపాధి హామీ బిల్లులను బకాయిలకు జమ చేసుకుంటున్నారని, అలా చేస్తే కూలీలు ఎలా బతకాలన్నారు. పథకాలకు వచ్చే బిల్లులను జమ చేసుకోవద్దని బ్యాంక్ అధికారులను కోరారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ బాల చంద్రుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుంకన్న, రామాంజనేయులు, లక్ష్మీనారాయణరెడ్డి, అంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుత్తి: శింగనమలలో ఆగస్టు 4,5 తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, మండల అధ్యక్షుడు నవీన్ యాదవ్ కోరారు. గుత్తిలో శుక్రవారం ప్లీనరీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్లీనరీ సమావేశాలకు ఎస్ఎఫ్ఐ నాయకులతో పాటు విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ప్లీనరీలో విద్యా రంగ, విద్యార్థుల సమస్యల గురించి చర్చ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్, థామస్, లోకేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.